# 71. సొరకాయ

ఓ పూజారి ఓ సారి తన గ్రామంలోని ఓ రైతు ఇంటికి వెళ్ళి చెప్పాడు.

"నువు గుడికి వచ్చి చాలా కాలమైంది. రేపటి నుంచి దేవుడి బ్రహ్మోత్సవాలు మొదలౌతున్నాయి. తప్పక రా."

"నాకు మోకాళ్ళ నొప్పి. కొండ ఎక్కి రాలేను. అయినా విడవకుండా నిత్యం గుడికి వచ్చే యాదగిరి, వెంకటేశ్వర్లు, సుబ్బారావులకి రాని నాకూ ఎలాంటి తేడా లేనప్పుడు, నేను ప్రత్యేకంగా గుడికి వచ్చి బావుకునేదేముంది?"

పూజారి మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఆ రైతు తనకి, పూజారికి జరిగిన సంభాషణని ఆ గ్రామస్థులకి చెప్పి, ఇంకా ఇలా చెప్పసాగాడు.

"గుడికి వెళ్ళే వాళ్ళకి, వెళ్ళని వాళ్ళకి తేడా లేదు. అంటే అసలు దేవుడు లేడనే కదా అర్థం."

ఈ విషయం పూజారి చెవిలో పడింది. ఓ రోజు ఆ పూజారి ఆ రైతు ఇంటికి వచ్చి అడిగాడు.

"నాకో సొరకాయ అవసరమైంది. మీ దొడ్లో పాదుకు చాలా కాస్తున్నాయని తెలిసి వచ్చాను. కొన్ని కోసుకోవచ్చా?"

"దాందేముంది? ఒకటి, రెండు కోసుకుని వెళ్ళు."

పూజారి తను కోసుకున్న రెండు కాయలు ఆ రైతుకి చూపించాడు.

"అదేమిటి? అలాంటివి కోసుకున్నావు? బాగున్నవి చాలా ఉన్నాయిగా?" అడిగాడు రైతు పూజారి చేతిలోని వంకర తిరిగి వికారంగా ఉన్న సొరకాయలని చూసి.

పూజారి జవాబు చెప్పకుండా వెళ్ళిపోయాడు. త్వరలోనే పూజారి తను పెంచే సొరకాయల గురించి చెప్పే మాటలు గురించి ఆ రైతు చెవిలోపడ్డాయి. తనకి సొరకాయలు పెంచడం రాదని, అన్నీ కుక్కమూతి

గల వికృత కాయలనే తను పండిస్తున్నానని ఆ పూజారి తన గురించి ప్రచారం చేస్తున్నాడని తెలుసుకున్న ఆ రైతు ఆవేదనగా పూజారి ఇంటికి వెళ్ళి అతన్ని నిలదీసాడు.

"ఇదన్యాయం. నేనెంత మంచి రైతునో నీకు తెలుసు. నేను పెంచిన మంచి సొరకాయలని చూసి కూడా వాటి గురించి ఎందుకలా చెడుగా మాట్లాడుతున్నావు?"

"గుడికి వచ్చే వారి విషయంలో నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం న్యాయం అయినప్పుడు, నేను నీ సొరకాయల గురించి నా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అన్యాయం ఎలా అవుతుంది?" ప్రశ్నించాడు పూజారి.

పూజారి మాటల్లోని విమర్శని గుర్తించిన ఆ రైతు వెంటనే తన తప్పుని గ్రహించాడు. ఆ తర్వాత అతను మళ్ళీ ఎన్నడూ భక్తుల విషయంలో ఎలాంటి విమర్శలు చేయలేదు.

## 72. అహంకారం

కొందరు మనుషులు ఓ అడవిలోకి వెళ్ళి తమ వివిధ అవసరాలకి సరిపడే ఆకులని ఎంపిక చేసుకుని కోసుకోసాగారు. కొన్ని చెట్ల ఆకులకి తమలో ఎవరు గొప్ప అన్న విషయం మీద అనుమానం కలిగింది. ఆ విషయం మీద అవి నేను గొప్పంటే నేను గొప్పని వాదించుకోసాగాయి. ముందుగా మామిడాకు గర్వంగా చూస్తూ చెప్పింది.

"నేను శుభస్కరం, మంగళకరం అయిన ఆకుని. మిగిలినవన్నీ అశుభ జాతికి చెందినవి."

ఆ అహంకార ఫలితంగా అది మనుషుల గుమ్మాల్లో తలకిందులుగా వేలాడసాగింది.

కూరల్లోకి కరివేపాకుని ఎంచుకున్నారు మనుషులు.